క్లుప్తంగా

వ్యవసాయ క్షేత్రాల సందర్శన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి, వెంకట్రామ్‌పల్లి, సింగాపూర్ గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం కేవీకే శాస్త్రవేత్త డి. శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయాధికారులు భూమిరెడ్డి, సతీష్‌రెడ్డి సందర్శించారు. వరిలో తెగుళ్లను గమనించారు. నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. ముందు జాగ్రత్తగా మందులు పిచికారీ చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా రాష్ట్ర కార్యదర్శి అంబటి వేణుకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్‌స్కేల్ మంజూరు చేస్తూ కేర్‌టేకర్లను నియమించాలని, సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, జిల్లా సహాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దూడం సాంబయ్య, ప్రధాన కార్యదర్శి గట్టు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీ చేపట్టాలి



వినతిపత్రం ఇస్తున్న కుమారస్వామి

సైదాపూర్: మత్స్యకార్మికుల సంక్షేమం కోసం చేపపిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని కరీంనగర్ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మత్స్యపారిశ్రామిక సహకారశాఖ కమిషనర్ నిఖిలకు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం భవనం నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.


సమస్య పరిష్కరించాలని గ్రామస్తుల వినతి



మాట్లాడుతున్న దమ్మక్కపేట గ్రామస్తులు

హుజూరాబాద్‌రూరల్: సమస్య పరిష్కరించాలంటూ మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేట గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కనకయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పలనర్సింగాపూర్‌కు చెందిన గూడురు రాంరెడ్డి ఇరవై ఐదేళ్ల క్రితం దమ్మక్కపేట గ్రామస్తులకు నాలుగు ఎకరాల ఏడు గంటల భూమి విక్రయించగా ఆ భూమిలో ఇళ్లు నిర్మించుకున్నారు. అమ్మిన భూమిని మళ్లీ తనపేరిట చేసుకోవడానికి భూభారతిలో దరఖాస్తు చేసుకున్నన్నాడని, ఏళ్లుగా రామ్‌రెడ్డి ఇబ్బంది పెడుతున్నాడని న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు.

సామాజిక సేవల్లో పాల్గొనాలి



విద్యార్థులతో హాస్యనటుడు ఆర్‌ఎస్ నంద

రామడుగు: ప్రతి విద్యార్థి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రముఖ హాస్య నటుడు ఆర్‌ఎస్ నంద అన్నారు. మండలంలోని వెలిచాల గ్రామంలో కరీంనగర్ మహిళా కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిసరాలను శుభ్రం చేశారు. సైబర్ క్రైం గూర్చి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

చిగురుమామిడి: మండల కేంద్రంలోని డార్విన్ హైస్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్న బెజ్జంకి రిత్విక్ తెలంగాణ స్పోర్ట్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం కరస్పాండెంట్ సమ్మిరెడ్డి, ప్రిన్సిపాల్ దమయంతి అభినందించారు. ఇటీవల మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రిత్విక్ పాల్గొన్నాడని తెలిపారు.

ఆసుపత్రి నిర్వహణపై పట్టింపేదీ?

- వేధిస్తున్న సెక్యూరిటీ, వైద్య సిబ్బంది కొరత
- మద్యం సేవించి ఆసుపత్రికి వస్తున్న రోగుల బంధువులు



హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రి

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి భద్రతపై నీలినీడలు అలుముకున్నాయి. వైద్య, భద్రతా సిబ్బంది కొరత కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఆసుపత్రిలో పనిచేసిన ఆర్‌ఎంవో సుధాకర్‌రావు ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్నారని, ఆసుపత్రికి వచ్చే రోగులను తొమ్మిది మంది సెక్యూరిటీ సిబ్బంది, నలుగురు ఎక్స్‌రే టెక్నీషియన్లు, ముగ్గురు వార్డ్ బాయ్స్, ఇద్దరు సూపర్‌వైజర్లు క్లినిక్‌కు పంపిస్తున్నారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఫిబ్రవరి 24న కలెక్టర్ విచారణ జరిపి ఆర్‌ఎంవోను సస్పెండ్ చేయడంతో పాటుగా 18 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో సమస్య మొదలైంది.

ఆసుపత్రికి రోగుల తాకిడి

ప్రస్తుతం ఆస్పత్రికి ప్రతిరోజు 400 నుంచి 500 మంది రోగులు వస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో సంఖ్య మరింత పెరిగింది. కానీ రోగులను నియంత్రించడానికి అవసరమైన సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రి నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో ఆస్పత్రి సిబ్బందిపై పనిభారం పెరిగి, విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. సెక్యూరిటీ, వైద్య సిబ్బంది కొరతతో ఆసుపత్రి నిర్వహణ పెనుభారంగా మారింది. అత్యవసర కేసుల వేళ వార్డుబాయ్స్, సెక్యూరిటీ లేకపోవడంతో ఆసుపత్రి లోపలికి తరలించడానికి క్షతగాత్రుల బంధువులే సాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రి ఆవరణలో సెక్యూరిటీ లేకపోవడంతో పార్కింగ్ సమస్య ఏర్పడుతోంది. రోగుల బంధువులు రాత్రివేళ మద్యం సేవించి ఆసుపత్రికి వస్తున్నారని మహిళా సిబ్బంది రాత్రి పూట డ్యూటీ చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు వెళ్దామంటే ఆసుపత్రి ఆవరణలో ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహనం పార్కింగ్ చేయడానికి స్థలం లేకుండా పోతోంది. ప్రభుత్వాసుపత్రికి వెళ్దామంటే ఇబ్బందిగా ఉంది.

– వేముల గోవర్ధన్, హుజూరాబాద్

చర్యలు తీసుకోవాలి



ఆసుపత్రికి వచ్చే రోగులు, అందులో పనిచేసే మహిళా సిబ్బంది భద్రతను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి. ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించాలి.

– వంశీదర్, హుజూరాబాద్

నిర్వాసితులకు అండగా ఉంటాం

–ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణంతో నష్టపోతున్నవారికి పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. మండలంలోని మధురానగర్‌చౌరస్తా ప్రజా కార్యాలయంలో మంగళవారం నారాయణపూర్, మంగపేట గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి రిజర్వాయర్ నిర్మాణంతో కలిగే నష్టంపై మొరపెట్టుకున్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయించడంతో పాటు ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం కేటాయించాలని వినతి

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే సత్యంకు చైర్మన్ గంట్ల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్లు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్లు గోపు శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం సత్యనారాయణ, మన్నె కిషన్‌చందర్, పులకం రాజమల్లు, ఎలగందుల శ్రీనివాస్, పల్లె రాంరెడ్డి, సీఈవో రాజు, అనిల్ పలువురు పాల్గొన్నారు.

పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల గ్రామీణస్థాయి క్రికెట్ టోర్నీ



ఎలిగేడు: ఎలిగేడు మండలంలోని ధూళికట్టలో ఈనెల 20న పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల గ్రామీణ స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ రంగు శ్యాంగౌడ్, విష్ణు, మనోజ్ తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లోని గ్రామీణ క్రీడాకారులు 19లోపు ఎంట్రీ ఫీజు రూ.1000 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నీలో పాల్గొనేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. విన్నర్ జట్టుకు రూ.20వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేలు ఉంటుందని తెలిపారు. వివరాలకు 78936 31921, 97040 34846, 88976 66069 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

శిథిల భవనాలు తొలగించాలి



వసతిగృహ పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

చొప్పదండి: పట్టణంలోని సమీకృత ఎస్సీ హాస్టల్ ఆవరణలో శిథిలావస్థలోని పాత భవనాలను తొలగించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సమీకృత బాలుర వసతి గృహాన్ని మంగళవారం తనిఖీ చేశారు. వసతి గదులు, టాయిలెట్లను పరిశీలించారు. మరుగుదొడ్లకు మరమ్మతు చేపట్టాలని, పాత భవనాలను తొలగించాలని హాస్టల్ వార్డెన్, సంబంధిత ఎస్‌ఈలను ఆదేశించారు.

టీఎల్‌ఎం మేళా, కళోత్సవం



కళోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుగోపాల్ రావు

జమ్మికుంట: పట్టణంలోని బాలుర పాఠశాలలో మంగళవారం కళోత్సవం నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని కళానైపుణ్యం ప్రదర్శించారు. తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంఈవో హేమలత హాజరై విద్యార్థులల్లో దాగివున్న సృజనాత్మకశక్తిని వెలికి తీయడాని కళోత్సవం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేస్, పద్మ, సుధాకర్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు బోధన అభ్యాసన ఉపకరణాలు ప్రదర్శించారు. కార్యక్రమానికి ఎంపీడీవో వేణుగోపాల్ రావు హాజరై మాట్లాడారు. ఎక్కువ సంఖ్యలోని ఉపకరణాలతో ఉపాధ్యాయులకు అన్ని విషయాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. రెండు ప్రదర్శనలను జిల్లా స్థాయి పంపిస్తామని ఎంఈవో మోహన్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యుల రాజిరెడ్డి, శ్రీనివాస్ దీక్షిత్, విద్యాసాగర్ రావు, ముల్కల కుమార్, కె. రాజమౌళి, శాంతి కిరణ్, ఆనందం, సాయన్న, కనుకయ్య, తదితదరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం, సంబురాలు

రామడుగు: చొప్పదండి నుంచి మల్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో మండలంలోని గోపాల్‌రావుపేట జెండా గద్దె చౌరస్తాలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ, బండి సంజయ్‌కుమార్ చిత్రపటాలకు బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

గన్నేరువరం: కరీంనగర్ నుంచి గన్నేరువరం మండలానికి మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా జీవో విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం పట్ల మంగళవారం గన్నేరువరంలో బీజేపీ మండల అధ్యక్షుడు నికేశ్,జగన్మోహన్ ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు తీసుకొచ్చిన కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ నుంచి నియోజకవర్గంలోని మల్యాల మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల బీజేపీ నాయకులు మంగళవారం ఆర్నకొండలో సంబరాలు నిర్వహించారు. అధ్వానంగా ఉన్న రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపిక



కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సిరిసిల్లలో జరుగనున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 17 ఎస్జీఎఫ్ వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలకు అల్ఫోర్స్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 15న కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జి.స్ఫూర్తి, డి.శ్రీహితలు ప్రతిభ కనబరిచి కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని సూచించారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం

కరీంనగర్‌స్పోర్ట్స్: రాంనగర్‌లోని పీటీసీలో 9వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో పదిరోజులుగా నిర్వహించిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఏకే జయంత, నిజామాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ రాజేశ్ కపూర్‌లు హాజరై మాట్లాడుతూ ఎన్‌సీసీలో నేర్చుకున్న క్రమశిక్షణ జీవితాంతం ఉపయోగపడాలని అన్నారు. ఎన్‌సీసీలో ఫైరింగ్, గార్డ్ ఆఫ్ ఆనర్, శిబిర సీనియర్లుగా వ్యవహరించిన ఉత్తమ కేడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ప్రపంచ ఓజోన్ దినోత్సవం

తిమ్మాపూర్: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రంగురంగుల గొడుగులు, ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ తీశారు. చిన్నారుల ర్యాలీ గ్రామస్తులను ఆలోచింపజేసింది. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు పూరం ఉమారాణి ఆధ్వర్యంలో, బయోసైన్స్ ఉపాధ్యాయుడు వి. సత్యనారాయణ, పర్యావరణ మిత్ర ఉపాధ్యాయుడు మహ్మద్ షరీఫ్ అహ్మద్ సమన్వయంతో నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇ.చక్రధర్, సయ్యద్‌షఫీక్, డి. శ్రీనివాస్ రెడ్డి, కె. లలిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం పాఠ్యాంశంగా చేర్చాలి



వీణవంకలో మాట్లాడుతున్న సంపత్‌డీ



రామడుగు: నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్

రామడుగు: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని గుండి గ్రామంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా అమరుడు గుండి దామెదర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరులను స్మరించుకుంటూ, వారి పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టులు ప్రభుత్వాల విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, సీపీఐ నాయకులు గంటె రాజేశం, మేడి శ్రీనివాస్, ముంజాల ప్రవీణ్, మేకల నాగరాజు, కుమారస్వామి, నర్సయ్య, మల్లేశం, హరీష్, అజీమ్ పలువురు పాల్గొన్నారు.

వీణవంక: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తుందని, పార్టీని ప్రజలు తరిమికొట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మంగళవారం అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాలుగువేల మంది వీరమరణం పొందారని, పదిలక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని పేర్కొన్నారు. అమరుల ఆశయాలను సాధించేందుకు రాష్ట్రంలో వివిధ పోరాటాలు, ఉధృతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పిల్లి రవియాదవ్, మండల నాయకులు ఓదెలు, రమేశ్, రాజు, రాజేందర్, కుమార్ తదితరులున్నారు.

వైద్య ఖర్చులు చెల్లించాలని ఆందోళన

శంకరపట్నం: వైద్యఖర్చులు చెల్లించాలని ఓ మహిళ ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన మంగళవారం కన్నాపూర్‌లో చోటుచేసుకుంది. బాధితుని బంధువుల తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన సంధ్య భర్త అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండగా జమ్మికుంటలో చదువుకుంటున్న కుమారుడికి రాఖీ పౌర్ణమి సెలవులు ఇచ్చారు తీసుకురావాలని సల్మాన్ అనే వ్యక్తికి ఫోన్ చేసింది. సల్మాన్ మరో వ్యక్తి శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై జమ్మికుంటకు వెళ్లారు. సంధ్య కుమారుడు ఆదిత్యను తీసుకువస్తుండగా కారు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సల్మాన్ కాలు విరగడంతో పాటు ఇతర గాయాల కారణంగా వైద్యఖర్చులు ఎక్కువ అయ్యాయి. వైద్య ఖర్చులు భరిస్తామని ఒప్పుకొని ఇప్పుడు చెల్లించడం లేదంటూ సంధ్య ఇంటి ఎదుట సల్మాన్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కేశవపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వైద్య ఖర్చులు చెల్లించే వరకు ఇంటిముందు నుంచి కదలమని పోలీసులను వేడుకున్నారు.

సంక్షిప్త వార్తలు

● సైబర్ మోసాలపై అవగాహన

రామడుగు: సైబర్ మోసాలకు గురైతే తక్షణం 1930 ఫిర్యాదు చేయాలని కరీంనగర్ సైబర్ క్రైమ్ ఎస్సై జ్యోత్స్న సూచించారు. మండలంలోని వెలిచాల గ్రామంలో కరీంనగర్ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్తులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. s

● కళల్లో రాణించాలి

హుజూరాబాద్: విద్యార్థులు చదువతో పాటు ఇష్టమైన కళలపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. పట్టణంలోని వీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి కళోత్సవాలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యనభ్యసించే సమయంలో వివిధ కళల్లో ప్రావీణ్యం పొందాలన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి కళోత్సవాలు దోహదపడతాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను 18న జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నామని, విజేతలకు బహుమతులు అందజేశారు.

● జేసీబీ, టిప్పర్ సీజ్

శంకరపట్నం: కొత్తగట్టు శివారులో అక్రమంగా మట్టి తవ్వుతూ హుజూరాబాద్‌కు తరలిస్తుండగా జేసీబీ, టిప్పర్ పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

● రోడ్డు భద్రతపై అవగాహన

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ ఓదెల్ కుమార్ అధ్యక్షతన మంగళవారం రోడ్డు భద్రతాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రోడ్డు నియమ, నిబంధనలను పాటించాలని, అతివేగం ప్రమాదకరమని రోడ్డు భద్రతాపై ప్రతిజ్ఞ చేయించారు.

● వర్షాలకు కూలిన ఇళ్లు

సైదాపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని బొమ్మకల్‌లో పాత ఇళ్లు కూలిపోయాయి. బాధితులకు అధికారులు తగినసాయంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏలూరి ఆదిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి కోరారు.

● అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అలుగునూరు శివారులో రాజీవ్ రహదారిపై మంగళవారం కారు బీభత్సం సృష్టించింది. కాకతీయబార్ సమీపంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. ప్రమాదం సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది.

● అత్తమామల పోషణ బాధ్యత కోడలిదే

జమ్మికుంట: వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన కొడుకు మృతిచెందాడు. అత్తమామల పోషణ బాధ్యత కోడలిదేనని మహిళా శిశుసంక్షేమ అధికారులు ఆదేశించారు. మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన పర్లపల్లి ఎల్లయ్య,రాజమ్మ కుమారుడుశంకర్ నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. అత్తమామల పోషణ బాధ్యతను కోడలు సుశీల పట్టించుకోలేదు. దీంతో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఆదేశాలు అనుసరించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● స్థల పరిశీలన

గంగాధర: మండలంలో నూతనంగా మంజూరైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు మంగళవారం ఎంపీడీవో ధమ్మని రాము స్థల పరిశీలన చేశారు. ఇస్లాంపూర్, వెంకంపల్లి, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో జీపీ భవన నిర్మాణాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇస్లాంపూర్ జీపీ భవన నిర్మాణానికి అవసరమైన రెండు గుంటల స్థలాన్ని గ్రామానికి చెందిన బారాజు ప్రభాకర్‌రెడ్డి విరాళంగా అందజేశారు. దాన పత్రాన్ని ఎంపీడీవో రాముకు అందజేశాడు.

● చెక్కుల పంపిణీ

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి రైతువేదికలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ జక్కని నరేందర్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామానికి చెందిన కొమురయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరైంది. మంగళవారం కాంగ్రెస్ నాయకులు కొమురయ్యకు చెక్కు అందజేశారు.

● ఎమ్మెల్యే పరామర్శ

గన్నేరువరం: మండలంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నాయకులతో కలిసి పరామర్శించారు.

● వైద్యశిబిరం

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ మహోన్నత పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 54 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన, వాధ్యరుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

● నేటి నుంచి స్వాస్థనారి స్వశక్తి పరివార్

కరీంనగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వాస్థనారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రాంలో జిల్లావ్యాప్తంగా 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 6 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యశిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరాల్లో ఎన్‌సీడీ, రక్తహీనత, క్యాన్సర్ స్క్రీనింగ్, హైపర్ టెన్షన్, డయాబెటిక్ సంబంధించిన స్క్రీనింగ్ చేసి వ్యాధులు నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేస్తామన్నారు. అవసరం ఉన్న వారికి రిఫరల్ చేసి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి తగు చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● ఘనంగా నిర్వహించాలి

కరీంనగర్‌టౌన్: సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. నిజాం నిరంకుశత్వానికి, రజాకర్ల రౌడీల దాష్టికానికి, బానిస బతుకుల సంకెళ్లకు విముక్తి జరిగి తెలంగాణ సమాజం నిజమైన స్వాతంత్ర్యం పొందిన రోజు సెప్టెంబర్ 17 అన్నారు. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తెలంగాణ విమోచన వేడుకలు అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ రామారావు, మాజీ ఎంపీటీసీ రామ్‌స్వరన్‌రెడ్డి, ధర్మకర్తలు పరమేశ్, గోపాల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మల్లేశ్, జూనియర్ అసిస్టెంట్ మోహన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నం వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మానకొండూర్: గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం మంగళవారం లెక్కించారు. శ్రీరాజరాజేశ్వర సేవాసమితి భక్తులు లెక్కింపులో పాల్గొన్నారని, రూ.1,50,975 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు. ట్రస్ట్ సభ్యులు ఆకుల గోపాల్‌రావు, గర్రెపల్లి శంకర్ లింగం, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ ఉద్యోగులు ప్రభాకర్ రెడ్డి, ఉమేశ్, అర్చకులు బసవయ్య, రాకేష్ భక్తులు పాల్గొన్నారు.